లైటు ఇంకా వెలుగుతూండడంవల్ల నాకు మెలకువ వచ్చింది. వాచీ చూసుకున్నాను. రెండైంది. రాజు మంచంవేపు చూశాను. వాడు మంచంమీద లేడు. తల కొంచెం పక్కకి తిప్పి టేబిలు ఉన్నవేపు చూశాను.

"అరె! రాజూ, ఇంకా చదువుతున్నావా? రెండైంది! ఏమిటి నీకీ పిచ్చి! చక్కా లైటార్పి పడుకో" అని మందలించాను.

"నన్ను డిస్టర్బ్ చెయ్యకు, నరహరీ. నన్ను చదువుకోనీ." విసుగ్గా అన్నాడు రాజు.

దగ్గిరకి వెళ్ళాను. వాడు చదివే నవల చూశాను. నాకు ఆశ్చర్యం, కోపం, చిరాకు ఒకేసారి ఎత్తుకు వచ్చాయి. అది "నీలినీడలు" నవల. పుస్తకం వెనక అట్టమీద "కుమారి వసుంధరాదేవి" అని రచయిత్రి పేరు, ఆమెను గురించి క్లుప్తంగా నాలుగు ముక్కలు రాసిఉన్నాయి.

"రాజూ, ఇదివరకు నువ్వీ నవల ఏ వందసార్లో చదివి ఉంటావు. ఇది నూటొక్కటోసారి కాబోలు చదవటం! ఏమైనా అర్థం ఉందా?"

"అర్థం ఉంది! చేసుకునేవాళ్ళకి మాత్రమే అర్థమవుతుంది! నీకు అర్థంకాదు. నీకేకాదు, నీలాంటి దద్దమ్మ లెవరికీ అన అర్థంకాదీ నవల! దీంట్లో రచయిత్రి ఎలాంటి పాత్రల్ని ప్రవేశపెట్టిందో చూడు! ఎంత నిపుణంగా విమర్శనాత్మకదృష్టితో, వివేచనాశక్తి మేళవించి రాసిందో గమనించు! ఈమె ఫోటో చూడు. నిండా పదిహేడు సంవత్సరాలన్నా ఉన్నట్టు లేవు. ఇంత చిన్న అమ్మాయి కలంలోంచి కవితా వాహిని పరవళ్ళు తొక్కుతూ ఎలా ప్రవహిస్తుందో ఈ నవల చదివి అర్థం చేసుకున్న వాళ్ళకితెలుస్తుంది! నరహరీ, నన్ను డిస్టర్బ్ చెయ్యకు. ప్లీజ్!"

వాడి ఈ ధోరణి నాకు కొత్తకాదు. కానీ ఏం చెయ్యటానికీ నాకు పాలుపోవటంలేదు. లోకంలో ఎంతోమంది ఎన్నో విచిత్రవ్యాధులతో బాధపడుతూంటారు. కానీ రాజు ... రాజు సంగతి వేరు. రాజు విషయంలో ఏం చెయ్యటానికీ తోచలేదు. నా నిద్ర తేలిపోయింది. రాజు నవల చదవటం ఆపేసి నవల వెనక అట్టమీద ఉన్న రచయిత్రి ఫోటోవైపే చూస్తూ ఉండిపోయాడు. వాడు ఆ రచయిత్రికోసం పిచ్చివాడై పోతున్నాడు. వాణ్ణి అలాగే చూస్తూ ఉండిపోయాను కాసేపు. క్షణకాలం నా ఆలోచనలు నన్ను గతంలోకి తీసుకువెళ్ళాయి.

రాజూ, నేనూ పుట్టినదగ్గిరనించి ఇప్పటివరకు స్నేహితులమే. మా స్నేహం ఎంత ఎక్కువైనదో చెప్పడంకూడా నాకు చేతకాదు. "మే మిద్దరం ప్రాణ స్నేహితులం. ఒకే కంచంలో తిని, ఒకే మంచంమీద నిద్రపోయేవాళ్ళం. ఒకరికోసం ఒకరం ప్రాణాలయినా ఇస్తాం." ఇలాంటి మాటలేవీ చాలవు మా స్నేహం ఇంత గాఢమైనదని చెప్పటానికి!

నేను వాడికంటే వయస్సులో రెండేళ్ళు పెద్దవాణ్ణి. కానీ వాడికంటే ఎన్నోరెట్లు పెద్దవాడిలా ప్రవర్తిస్తాను; బాధపడతానుకూడా. కారణం — వాడి లేతముఖం, అమాయికత్వం, కుర్రచేష్టలూను. బి. ఏ. ఆఖరు సంవత్సరంలోకి వచ్చినా ఇంకా వాడిలో చిలిపితనం తగ్గలేదు. రాజు కథలు, కావ్యాలు అంటే చెవి కోసు

**పునర్జన్మ ఉన్నపుడు పూర్వజన్మ కూడ ఉండేవుంటుంది....పూర్వజన్మ సంస్కారంవల్ల గత జన్మలోని ప్రేమానురాగాలు కొందరిని అంటి పెట్టుకుని ఉంటాయి. స్త్రీ, పురుషుల ప్రేమకు పూర్వజన్మబంధమో, ఋణ బంధమో కారణం అయినా కాద నలేం. గుడ్డిగా ప్రేమించినా, ఆరా ధించినా, ప్రియాన్వేషణలో మరణిం చినా విలువలు మారవు. మనుషుల మధ్య దూరం జన్మాంతర సిద్ధం కావచ్చు. కాని మనసుల ఐకమత్యం ఎప్పుడు సన్నిహితమే అవుతుంది.**

కుంటాడు. ఫిఫ్తుఫారం పాసవకముందే ఎన్నో నవలలు చదివాడు. ఆ చిన్న వయస్సులోనే కథలుకూడా రాస్తూండేవాడు. నాకు కథలంటే అంత ఇష్టమూ లేదు, అయిష్టమూ లేదు. కానీ వా డెక్కడ బాధ పడతాడో అని వాడి అముద్రిత కథల సంపుటి అంతా చదివేవాణ్ణి. వాడికి మంచి ప్రోత్సాహం ఇచ్చేవాణ్ణికూడా.

పాపం, రాజు తల్లి చిన్నతనంలోనే వాడికి దూరమైంది. ఆమెమీదా, కొడుకుమీదా ఉన్న ప్రేమచేత వెంకట్రామయ్యగారు మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఆయన గ్రామమునసబు. కూర్చొని తిన్నా జీవితమంతా గడిచిపోయేంత ఆస్తి ఉంది. రాజొక్కడే ఆయన సంతానమేమో, వీణ్ణి చాలా గారాబంగా పెంచుకుంటూ వస్తున్నా రాయన.

స్కూలుఫైనలు పూర్తికాగానే దగ్గిర్లో ఉన్న బందరులో కాలేజీలో చేరాం నేను, రాజూను. ఎక్కడికి వెళ్ళినా, ఏ పని చేసినా ఇద్దరం కలిసే చెయ్యాలని రాజు మొరాయింపు. వాడికి నామీద గల ఆపేక్ష అలాటిది! మూడు సంవత్సరాలు నేను, వాడు ఒక గదిలో అద్దె కుంటూ కాలేజీ జీవితం హాయిగా గడిపాం. ఇంకో సంవత్సరం జాగ్రత్తగా చదివితే డిగ్రీ వస్తుంది.

కాని, ఆరునెలల్రికితం రాజు ఎక్కణ్ణించో "నీలినీడలు" నవల తీసుకువచ్చాడు. చదివిన తరవాత కథనీ, అంతకంటే ఎక్కువగా రచయిత్రినీ తెగ మెచ్చు కున్నాడు. ఎప్పుడూ అందులోని పాత్రలను గురించీ, అందులో ఉన్న కొన్ని ప్రేమఘట్టాల్నీ నా దగ్గిర కొన్ని రోజులపాటు ఏకరువుపెట్టాడు. ముఖ్యంగా రచయిత్రిని చాలా పొగిడాడు. అసలు నిజం చెప్పాలంటే స్త్రీలే పురుషులకన్నా చక్కగా రాయగలరన్నాడు. వాళ్ళ రచనాశక్తి అమోఘమన్నాడు. "నీలినీడలు" రాసిన వసుంధరాదేవిని నా దగ్గిర ఎన్ని రోజులు ఎంతగా ఎలా పొగిడాడో చెప్పలేను! నవల అట్టమీద ఉన్న ఆమె చిత్రం గంటల తరబడి చూస్తూ పొంగిపోయే వాడు.

'ఈమెలోనా ఇంత కవిత్వం ఉంది!' అని ఆశ్చర్య పోతూండేవాడు ఎప్పటికప్పుడే.

# ఎస్. సుందర శివరావు

చివరి కో రోజున తను "ఆమెను ఎంతగానో ఆరాధిస్తున్నా" నన్నాడు. నేను వాడికి కమ్మలు కట్టి తెగ ఏడిపించాను. చాలా తీవ్రంగా విమర్శించాను, పరిహసించాను. కాని వాడు సిగ్గుపడలేదు. పైగా, నేనేమనుకున్నా తనకి ఖాతరు లేదన్నాడు. వాడు మనస్సులోనే ఆమెను ఆరాధిస్తున్నానని అప్పుడప్పుడల్లా వాణ్ణి "ఏడిశావు పో"మ్మంటూండేవాణ్ణి. కానీ రాను రాను వాడి వ్యవహారం నే నూహించనిరీతిగా శ్రుతి మించి రాగాన పడసాగింది. ఎప్పుడూ నవ్వుతూ, నలుగుర్ని నవ్విస్తూ చలాకీగా ఉండే రాజులో మందకొడితనం ప్రారంభమయింది. ఈ మందకొడి తనం నిరుత్సాహంగానూ, విరక్తిగానూ మారటానికి ఆట్టేకాలం పట్టలేదు.

కాలేజీకి సరిగ్గా వెళ్ళటం మానేసి నాలుగు నెలలయింది. ఆరోగ్యంగా ఉండే రాజు క్షీణించిపోవటం ప్రారంభించాడు. గంటలతరబడి "నీలినీడలు" రాసిన రచయిత్రి చిత్రం చూస్తూ గడిపేస్తున్నాడు. మొదట్లో వాణ్ణి చూస్తే నాకు నవ్వు వచ్చేది. పరిహసించేవాణ్ణి. నవ్వి ఊరుకునేవాడు. కానీ ఆ రచయిత్రి నేమైనా అంటే విరుచుకుపడేవాడు.

* * *

వాచీ చూసుకున్నాను. తెల్లవారుఝాము మూడున్నర అయింది. నాకిక ఊరుకో బుద్ధి కాలేదు.

"ఒరేయ్, రాజూ, నీ వ్యవహారం అంతా చూస్తుంటే పిచ్చివాడితంతులా ఉంది. ఎవరేనా వింటే నవ్వుతారు కూడాను. అయినా ఆ వసుంధరాదేవిమాత్రం ఏం మహా ఊడబొడిచేసింది? దీన్ని మించిన వాళ్లెంతమంది లేరు? నా కేం మెచ్చుకోతగిన నవలలాగ అనిపించటం లేదు."

నా మాట పూర్తి కానివ్వకుండానే కాస్త బాధగా అన్నాడు రాజు: "నరహరీ, నోటి కెలా వస్తే అలా మాట్లాడకు. ఆమెను 'ఇది, నది' అని సంబోధించకు. నీది పట్టి కళాయిబుర్ర. నీకు కవిత్వం రాదు. కనీసం దాన్ని మెచ్చుకునే గుణమైనా నీలో లేదు. కానీ అర్థం చేసుకోగలిగిన వాళ్ళకి తెలుస్తుంది అది ఎంత మధుర మైనదో, విలువైనదో! ఈ పుస్తకం చూడు. ఇది చదువు. ఒక ప్రేమికుడు తన ప్రేమమూర్తికి రాసుకున్న ప్రేమలేఖ! కాదు, విరహగీతిక! నువ్వీ జన్మలో ఇలా రాయగలవా?" ఆ నవలలోని ఒక ప్రేమలేఖ చదవటం మొదలెట్టాడు.


"నా ప్రేమరాణి రేఖా! ఒక ప్రేమజీవి ఇక్కడ తపస్సు చేస్తున్నాడు! తన తపస్సు దేనికోసం? తన ప్రణయరాణి పొందుకోసం! పవిత్ర గంగామతల్లి పరవళ్ళుతొక్కుతూ, అలలు విసురుతూ, మెల్ల మెల్లగా, చల్లచల్లగా పరుగెత్తుతూంది! గట్టునవున్న మాలతీ లతల పందిళ్ళగుములు భయంతో జలదరించాయి. ఆ జలదరింపులకు వాటి విరులలో ఉన్న నెత్తావులు గుప్పుమని గుబాళించాయి! సంధ్యాసమయం కాబట్టి సూర్యబింబాన్ని తమ కౌగిళ్ళతో బంధించటానికి పంచ రంగుల మేఘమాలలు విశ్వప్రయత్నం చేస్తున్నాయి! తానిక ఏమీ చెయ్యలేనని, తన వేడిమి భరించలేరని సూర్యబింబం హెచ్చరించి పడమటికొండల వెనక్కి తప్పుకుంటూంది! అప్పుడే లోకమంతా చీకట్లు రాయలు చేరకుండా, ప్రేమమయులగు మీరు ప్రణయాం

ఒడిలో మునిగిఉండగా 'వెన్నెల మాలలతో మిమ్మల్ని అలంకరిస్తానోయ్, ప్రేమను పంచిఇస్తానోయ్' అంటూ తన చల్లని కిరణరాసుల్ని ప్రసరింపజేస్తున్నాడు రేరాజు!

ఆ పరిసరాలన్నీ అతడు తన హృదయరాణి పొందుకై చేస్తున్న తపస్సులోని తీవ్రతకు, గానంలోని విరహాగ్నికి జ్వలించిపోతున్నాయి! ఆ ప్రియుని పిలుపు విని తన ప్రేమమయి ఏవైపునుండి వస్తుందో, అతని ఎదుట ఎలా సాక్షాత్కరిస్తుందో, అతని హృదయంలో ఎలా లీనమవుతుందో, ఏ పిల్లతెమ్మెరలు తన ప్రేయసిని తన బాహువుల్లో చేరుస్తాయో, ఏ మేఘమాలలు ఆ ప్రేమమయిని తోడితెస్తాయో అని అతని హృదయం ఆరాటపడుతూ ఎదురుచూస్తోంది!" చదవటం ఆపి, "వింటున్నావా, నరహరీ, ఆ ప్రేమజీవి ఎలా తపస్సు చేస్తున్నాడో! అతని హృదయాన్ని ఎంత విపులంగా విడమర్చి మనముందు పెట్టిందో చూడు రచయిత్రి! ఇంత తియ్యని ప్రేమరసాస్వాదాన్ని నువ్వర్థంచేసుకోలేకపోతున్నావంటే నాకు చాలా విచారంగా ఉంది! నేనూ ఆ ప్రేమజీవిలాగే ఈ రచయిత్రిని ఆరాధిస్తున్నానంటే నువ్వు నమ్ముతావా?" అని హెచ్చరించాడు.

"నమ్మడంకాదు, నీకు పిచ్చి ఎత్తిందంటాను. నీ పిచ్చివాగుడు వింటూంటే నాకు పిచ్చెత్తేటట్టుంది. నీ వెర్రి కాకపోతే నువ్వా రచయిత్రిని ప్రేమించట మేమిట్రా? ఏదో కథ చదివావు, మెచ్చుకున్నావు. రచయిత్రి కవితావటిమకి ఉబ్బి తబ్బిబ్బయ్యావు. అంత వరకు బాగానే ఉంది. కానీ ఈ పైత్యమేమిటి? ఎవరైనా వింటే నవ్వుతారు. నా మాట విని ఆ పుస్తకం ఎక్కడైనా పారేసి చక్కా నీ పాఠాలు చూసుకో. పరీక్షలు దగ్గిరకొస్తున్నాయ్." నచ్చచెప్పాను.

"అదికాదు, నరహరీ, నేనా అమ్మాయిని చూడాలి. ఆమె కళ్ళు చూడు ఈ ఫోటోలో! వాటిలో ఎంత ఆకర్షణ ఉంది! అమాయకత్వం ఉట్టిపడుతూండే ఆమె ముఖం చూడు! నాకు మరేం వద్దు. ఆమె ఒడిలో తల పెట్టుకొని, ఆమె కళ్ళలోకి తనివితీరా చూస్తూ నా జీవితమంతా గడిపెయ్యాలని ఉంది! కానీ. . . కానీ. . అదెలా సాధ్యం? అది ఈ జన్మలో జరిగే పనికాదు, నరహరీ! నాకు తెలుసు, నా ప్రవర్తన అంతా నీకు వింతగా, వెగటుగా ఉందని! అంతేకాదు, నా దంతా వెర్రివాడి తంతులా ఉంటుంది నీమట్టుకి. కాని ... కాని ఈ నవల ముగించిన తక్షణం 'ఆమె ఫోటో చూస్తూ ఎన్నో గంటలు ఉండిపోయాను. ఈమెలో పొంగిన కవితావాహినికి ఆశ్చర్యపోయాను. నాకు తెలియకుండానే ఆమెపై ఏదో అవినాభావ సంబంధం ఏర్పడి నా హృదయంలో బలంగా ఆమెపై ఒక అనురాగబీజం నాటుకుపోయింది! కానీ ఏం లాభం? నేనేమీ చెయ్యలేని స్థితిలో ఉన్నాను. ఆమె దగ్గిరికిపోయి, నన్ను ఇన్నాళ్ళూ ఎంతలా ఏడ్పించిందో చెప్పి, మరెప్పుడూ నన్నిలా ఏడ్పించవద్దని ఆమె హృదయంలో తలదాచుకుని ఏడవాలని ఉంది! నా బాధ నీకు తెలియదురా, నరహరీ! ఆమె ఈ జీవితంలో నాది కాజాలదని తెలిసికూడా ఇలా ఆమె కోసం పిచ్చివాణ్ణి అవుతున్నానంటే నీకు వింతగా ఉంది మరి! అసలు నే నా నవల ఎందుకు చదివానా అనిపిస్తోందిప్పుడు. ఉన్మత్తుణ్ణి అయిపోతున్నాను కదూ! ఆమెను కనీసం ఒక్కసారైనా ప్రత్యక్షంగా చూడాలని నా మనస్సెంత ఆరాట పడుతూందో నీ కెలా తెలుస్తుంది? ప్రతి క్షణం ఆమె తలపే! ప్రతి క్షణం ఆమె రూపప్రతిమ నా కళ్ళలో మెదులుతూంది! అనుక్షణం ఆమె నాది కాదుకదా అనే సత్యం నన్ను చిత్రహింసచేస్తోంది. నరహరీ, జీవితంలో ప్రేమ అనే పదానికి అర్థం ఇప్పుడే తెలుసుకున్నాను" అంటూ బాధగా ఉన్మాదిలా వాగాడు రాజా.




రెండు వారాలు గడిచాయి.

మొదట్లో వీడి విషయం నేనంత తీవ్రంగా తీసుకోలేదు. అదే నేను చేసిన పొరపాటు. నిజానికి "ప్రేమ" అనే పదానికి నిర్వచనం నాకు తెలీదు. ఎవరేనా ప్రేమించుకుంటున్నారని వింటే ఏదో విడ్డూరంలా ఉండేది నాకు ప్రేమేమిటా అని! అలా ప్రేమించుకునేవాళ్ళని పట్టి అమాయకులకింద జమకట్టేసేవాణ్ణి.


ప్రేమంటే రెండు హృదయస్పందనాల శాశ్వత కలయిక అనీ, రాగరంజితమైన రెండు హృదయాల బంధమనీ ఇంకా ఏమేమిటో పలురకాలుగా కవులు వర్ణిస్తుంటారు. అవన్నీ నేను హేళనతో ఏవగించుకుంటూ చదివేవాణ్ణి. ఒక్కొక్కప్పుడు విసుగెత్తి అటువంటి చెత్తరాతలు చదవటం మానివేసేవాణ్ణి. అవన్నీ చెత్తకింద కొట్టిపారేసేవాణ్ణి.

రాజా విషయం మొదట్లో పట్టి పరిహాసంకింద తీసుకున్నా, తదవాత అందులోని సత్యాన్ని అర్థం చేసుకున్నాను!

ప్రేమ అనేది ఉంది. అది చాలా పవిత్రమైనది అని తెలుసుకున్నాను. స్త్రీ పురుషులు ఒకరినొకరు హృదయపూర్వకంగా ఆరాధించుకోవటమే ప్రేమ. అయితే ఈ ప్రేమ వేరు. ఇందులో ఎంతో ఆనందం, మధురానుభవమూ ఉన్నాయి.

"ఆఁ, ప్రేమాలేదు, గీమాలేదు. చొప్పదంటు కబుర్లు!" అని అనుకునేవాళ్ళకిమాత్రం చాలా అవకాశం లభిస్తేనేగాని దాని అర్థం బోధపడదు.

నిజంగా రాజా హృదయం ఆ రచయిత్రి వసుంధర కోసం, ఆమె పొందుకోసం అలమటిస్తోందని మొదట్లో నేను గ్రహించలేకపోయాను. అదీకాక, నాకు వాడి వింతప్రవృత్తి చాలా అసహజంగా తోచింది. అవును, మనం ఎన్ని పుస్తకాలు చదవటంలేదు! ఎంత మంది కళారాధకుల్నీ, కళాకారుల్నీ చూడటంలేదు! వాళ్ళందరికోసం పిచ్చెత్తిపోగలమా! ఏమేనా అర్థముందా? జీవితంలో ఎంతోమంది తారసిల్లుతారు. ఎన్నో రకాల వింత అనుభవాలు ప్రతి వ్యక్తి జీవితంలోనూ ఉంటాయి. వాటివల్ల మనసులు పాడుచేసుకుంటున్నారా అందరూ? ఈ మాటే రాజాతో అంటే వాడు, "నిజమే, నరహరి. నువ్వేకాదు, నా సంగతి విన్న వా డెవడైనా నీలాగే మాట్లాడతాడు. కానీ నా కిదొక




ఋతుక్రమం ఆలస్యమైతే?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి
దేవిపిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన, లేక ఆగిపోయిన బహిష్టుకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును
SEENU & CO., MADRAS-21
స్టాకిస్టు: మెస్సర్స్. సిటీ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్
రాంగోపాల్ స్ట్రీట్, విజయవాడ—1.

KS.G.11.TL

# క్రుశ్చేన్
## మీ వయస్సు యేమైనామిమ్మల్ని పసివారుగా వుంచుతుంది

ప్రతిరోజు క్రుశ్చెన్‌ను వాడి మీ యౌవనపు పటిమను కాపాడుకోండి. క్రుశ్చెన్‌లో ఆరు అత్యావశ్యకమైన ఖనిజ లవణములు సరైన పాళ్ళలో కలిసి యుండుట వలన అది మలబద్ధము, కీళ్ళ నొప్పులు, కాలిజము మరియు మూత్రపిండములకు సంబంధించిన వ్యాధులు, వాత రోగము, నడుము నొప్పులు—వీటనన్నిటిని రాకుండా చేయును.

క్రుశ్చెన్ యీ విధంగా మిమ్మల్ని పసివారుగా వుంచుతుంది: * మూత్రపిండములను కడుగుతుంది * కాలిజమును చురుకుపరుస్తుంది * రక్తము శుభ్రపడుటకు సహాయపడుతుంది * జీర్ణశక్తిని వృద్ధిచేస్తుంది * ఆకలిని వృద్ధిచేస్తుంది * కీళ్లలో నొప్పుల నుంచి ఉపశమనము కలిగిస్తుంది.

సులభమార్గములో యౌవనవంతులుగా వుండండి—ప్రతిరోజు ఒక చెంచాడు క్రుశ్చేన్‌ను వాడండి.




నికోలస్ (N) ఉత్పత్తి


అనుభవం! మధురానుభవం! అనవరతమూ నేను పడుతున్న విరహవేదనలో, ఆమెకోసం పరితపించటంలో కూడా నా కానందం ఉంది. నన్ను మూర్ఖుడనే అను, పిచ్చివాడనే అను. కానీ నే నామెను మరవలేను! ఆమె కోసం చేస్తున్న ఈ నా తపస్సులో నా జీవితం అంతమై పోయినా నా కానందమే!" అని ఉద్వేగంతో చెప్పుకుపోతున్నాడు.

ఇక వాడితో వాదించి లాభం లేదు. వాడి మస్తిష్కం పాడయిపోయింది. ఒకే పాట పలు రకాలుగా పాడుతున్నాడు వాడు!

వీడి తత్త్వం అసహజంగా ఉన్నా, పూర్తిగా అసహజమని కొట్టిపారెయ్యలేం! ఏమంటే ఇదివరకు నేను నా కళ్ళతో రెండు సంఘటనలు చూశాను. నే నప్పట్లో చాలా చిన్నవాణ్ణి. ఒక యువకుడు ఒక సినీతారకోసం పిచ్చివాడైన ఉదంతం నే నెరుగుదును. అతను ఆ తార నటించిన ఒక ప్రత్యేకమైన సినిమా ఏ వందసార్లో చూశాడు. ఆమెకోసం మద్రాసు పరిగెత్తాడు. హతాశుడై తిరిగివచ్చాడు! కొన్నాళ్ళకి ఆ సినిమాలోని విరహగీతాలు పాడుకుంటూ పిచ్చివాడై రోడ్లమీద తిరిగాడు! ఆ తరవాత అత నేమయ్యాడో నాకు గుర్తులేదు. అప్పట్లో చిన్నవాణ్ణి కాబట్టి నా కంతగా అతన్ని గురించి పట్టలేదు. కానీ ఇప్పు డర్థం అవుతూంది!

మరొకతను ప్రముఖ హిందీతార ఒకామెకోసం పిచ్చివాడయ్యాడు. అతని ఇంట్లో, అతని పుస్తకాల్లో, అతని మనీపర్సులో ఎక్కడ చూసినా ఆమె ఫోటోలే! న్యూస్‌పేపరులోవీ, ఫిల్మ్‌ఫేర్‌లోవీ వివిధ భంగిమల్లో ఉన్న ఆమె ఫోటోలు సేకరించి కత్తిరించి తన దగ్గిర ఉంచుకునేవాడు. అవే చూసుకుంటూ, ఆమె పేరే ధ్యానంచేస్తూ కాలం గడిపేవాడు. ఎవరితోనూ మాట్లాడేవాడేకాదు. ఎప్పుడూ తన గదిలోనే కూర్చొని ఆమె ఫోటోలే చూసుకుంటూ, మురిసిపోతూ కాలం గడిపివేసేవాడు. అప్పు డనిపించకపోయినా, నా కిప్పు డనిపిస్తూంది, ఇటువంటి పిచ్చి ఆరాధనలు నమ్మతగనివి మాత్రం కావని!

• • •

రాజు ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తూంది. నిద్రాహారాలు సరిగ్గా లేని కారణంగా బాగా నీరసించి పోయాడు. కళ్ళు లోతుకి పోయాయి. ముఖం పీక్కుపోయింది. ప్రేతకళ ఉట్టిపడుతూంది వాడి ముఖంలో. చలాకీగా, చురుగ్గా చాకులా ఉండేరాజుకీ, ఇప్పటి రాజుకీ పోలికే లేదనిపిస్తూంది. నాతో ఇదివరకులా మాట్లాడ్డమే మానివేశాడు.

ఆ రోజు ఉదయం నేను లేవటానికిముందే రాజు లేచాడు. నేను లేచి చూసేసరికి వాడు యథాప్రకారం ఆ నవల అట్టమీద ఉన్న రచయిత్రి ఫోటో చూడడంలో లీనమై ఉన్నాడు. నాకు పిచ్చెత్తినట్టయింది. వాడి చేతిలో ఉన్న పుస్తకం లాక్కుని గిరవాటేశాను. అంతే! వెంటనే వాడు నా మీదకి బెబ్బులిలా ఉరికి "స్కౌండ్రల్, మేనర్సు లేవూ!?" అంటూ నా చెంప ఛెళ్ళు మనిపించాడు! ఈ హఠాత్సంఘటననించి తేరుకోవటానికి నాకు అయిదు నిమిషాలు పట్టింది.

వాడు నా కళ్ళముందే పిచ్చివాడవుతూండటం నేను సహించలేకపోయాను. నా కళ్ళలో నీరు తిరగటం

ప్రారంభించింది. అది గమనించి వాడేమనుకున్నాడో ఏమో మెల్లిగా నా వీపు నిమురుతూ, "నరహరీ, నన్ను క్షమించు. తొందరపడ్డాను. ఇక నా జోలికి మాత్రం రావద్దని నిన్ను ప్రార్థిస్తున్నాను!" అని చేతులు జోడించాడు. నేను బాధపడ్డది వాడు కొట్టిన చెంప దెబ్బకుమాత్రం కాదని వాడు గ్రహించలేకపోయాడు. అవును మరి, వాడి లోకంలో ఉంటేగా!

ఇక ఇలా లాభంలేదు. వెంటనే లేచాను. ఏదో ఒక నిశ్చయానికి రావాలి. కాలకృత్యాలు ముగించుకుని బట్ట వేసుకుని పోస్టాఫీసుకు వెళ్ళాను. వెంకట్రామయ్యగారి కొక ఎక్స్‌ప్రెస్ లెటరు రాశాను. రాజా ఆరోగ్యం బాగు లేదనీ, కొన్నాళ్ళు రెస్టు అవసరమనీ, వచ్చి రాజాను తీసుకువెళ్ళమనీ, పరీక్షలమూలంగా నేనే రాజాను స్వయంగా తీసుకురాలేకపోతున్నందుకు క్షమించమనీ వివరించి పోస్టు చేశాను.

ఒక మూల నాలో భయం కదలాడింది. ప్రస్తుత పరిస్థితిలో రాజాని చూస్తే వెంకట్రామయ్యగారు, "ఇన్నాళ్ళూ ఏం చేస్తున్నా" వని నామీద మండి పడవచ్చు. వెంటనే ఆయనకి నామీద ఉన్న సదభిప్రాయం, ఆపేక్షా జ్ఞప్తికి తెచ్చుకుని గుండె దిటవు చేసుకున్నాను.

● ● ●

గదికి వచ్చేసరికి రాజా పడుకొని ఉన్నాడు. నిద్ర పోవటంలేదు. పిచ్చిగా ఇంటికప్పుకేసి చూస్తూ పడుకున్నాడు. నేను వచ్చిన అలికిడికి లేచికూర్చున్నాడు. టైము పది గంటలైంది. హోటలు కుర్రాడు కారియర్ తెచ్చి గదిలో ఉంచి పోయాడు.

"రాజా, నిన్ను చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంది. నువ్వు పూర్తిగా ఆ రచయిత్రి గురించి ఆలోచించటం మానెయ్యాలి. నీ ఆరోగ్యం ఎంతగా దిగజారిపోయిందో చూసుకున్నావా? నువ్విలా అర్థం లేకుండా పిచ్చివాడివై పోవటం చాలా బాధాకరం. నువ్వు మారాలి. మామూలు మనిషివవాలిరా!" అన్నాను.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం మా ఇద్దరి మధ్యా నాట్యం చేసింది. వాడేం మాట్లాడకపోవటంతో—

"పోనీ రాజా, నువ్వు పెళ్ళి చేసుకోకూడదూ?" అన్నాను.

ఉలిక్కిపడ్డాడు రాజా. నిస్సహాయంగా నవ్వి ఊరుకున్నాడు.

"నీకు కావాలంటే, నువ్వు తలుచుకుంటే ఈ రచయిత్రికంటే అందమైనవాళ్ళూ, ఐశ్వర్యవంతులూ నీ కాళ్ళముందుకు వచ్చి వాలతారు!" నా మాట పూర్తికానివ్వలేదు వాడు.

"ప్లీజ్ . . . నరహరీ, నా వివాహ విషయం ప్రస్తావించకు. నీకు నామీద అంత ఆపేక్షే ఉంటే, నా కొక్క సహాయం చెయ్యి చాలు. ఎందుకో నే నింక ఎన్నో రోజులు బతకననిపిస్తోంది. నేను వెళ్ళిపోయే లోపల నీకు చాతనైతే ఆ అమ్మాయిని ఒక్కసారి నాకు చూపించు. నా కదే నువ్వు చెయ్యబోయే మహోపకారం!" వాడు ఇలా అనగానే ఎందుకో నాకూ వాడు అట్టే కాలం బతకడనిపించింది! వెంటనే భయంగా ఆ ఆలోచన దూరంగా పారద్రోలాను!

ఒక దృఢ నిశ్చయానికి వచ్చాను. వాణ్ణి మనిషిని చెయ్యాలి. నా శాయశక్తులా ప్రయత్నించి, వీలైతే వాడి ప్రేమమయిని వాడి కప్పజెప్పాలి!

"రాజా, ఇక నీ మాటలతో నన్ను నొప్పించకు. నీ కోసం ఏమైనా చేస్తాను. నా ప్రాణాలయినా ఇస్తాను. నా మాట నమ్ము రాజా!" వాగ్దానం చేశాను.

ఆ మరునాడు వెంకట్రామయ్యగారు వచ్చారు. రాజాను చూసి బావురుమన్నారు! వాడు మాత్రం చలించలేదు. ఆయన వెంటనే వాణ్ణి తీసుకుని స్వగ్రామం వెళ్ళిపోయారు. వెళ్ళేముందు నాతో వాడు తాను చెప్పిన సంగతి గుర్తుచేసి మరీ వెళ్ళిపోయాడు.

* * *

పరీక్షలైపోయాయి. ఓ మాదిరిగా రాశాను. పరీక్షలైన మరునాడే "సిరిసిరిడలు" నవల రాసిన రచయిత్రి అడ్రసు తెలుపవలసిందని కోరుతూ ఆ నవల ప్రచురించిన కె. వి. యస్. ప్రచురణాలయానికి ఒక ఉత్తరం రాశాను. నాలుగు రోజులో నాకు సమాధానం వచ్చింది ఆ కార్యాలయం నించి. దానిలో రచయిత్రి అడ్రసు ఉంది. "వసుంధరాదేవి, కేర్ ఆఫ్ శ్రీ రాజశేఖరం, నాగులాపల్లి" అని ఉంది. తమకి తెలిసిన చిరునామా అంతేననీ, పూర్తిఅడ్రసు ఇంటినంబరుతో సహా ఇవ్వలేనందుకు చింతిస్తున్నామనీ రాశారు వాళ్ళు. అయినా ప్రయత్నం మానకూడదని ఆ అడ్రసు సూట్‌కేసులో భద్రపరిచి, రెండుజతలు బట్టలు సర్దుకుని స్టేషను చేరుకున్నాను.

* * *

అనకాపల్లి చేరుకునేసరికి ఉదయం ఎనిమిది అయింది. అక్కణ్ణించి ఓ రిక్షా చేయించుకుని నాగులాపల్లి బయలుదేరాను.

నాగులాపల్లి చాలా చిన్న ఊరు. అంతకుముందు ఎప్పుడూ నే నక్కడికి వెళ్ళలేదు. ఎగుడుదిగుడు వీధులతో, తాటాకు ఇళ్ళతో, గోచీలు కట్టుకు తిరిగే పల్లెవాళ్ళతో నిండి ఉంది ఆ ఊరు. అంతా పల్లెటూరి వాతావరణం. ఊరికి కొంత దూరంలో తివాసీలు పరిచినట్టున్నాయిపచ్చికబయళ్ళు. చిన్నచిన్నదుకాణాలూ, కాఫీహోటళ్ళూ చాలా సందడిగా ఉన్నాయి. పాలూ, పెరుగూ అమ్మే గొల్లపడుచులతోనూ, కడవలతో నీళ్ళు మోసుకునే పల్లెపడుచులతోనూ కోలాహలంగానూ ఆహ్లాదకరంగానూ ఉంది ఊరు.

దగ్గర్లోనే ఉన్న కిళ్ళీషాపు వద్దనున్న ఓ మీసాలాయన్ని సమీపించి "రాజశేఖరంగారనే ఆయన తెలుసా?" అని అడిగాను. వెంటనే అతను తనకాయన బాగా తెలుసనీ, అతని స్వంతఊరు అదేననీ, వాళ్ళతాత ముత్తాతలందరూ తరతరాలనుంచీ అక్కడే ఉంటూండే వారనీ, ఆయనది చాలా గొప్పవంశమనీ, వాళ్ళ వృత్తి వ్యవసాయమనీ, ఏమిటేమిటో వాళ్ళ గురించి చాలా చెప్పాడు. నేనవన్నీ సావధానంగా వినేస్థితిలో లేను. ముందు నన్నతని దగ్గిరికి తీసుకుపొమ్మని అతన్ని తొందర చేశాను.

అతను నా ఆత్రతచూసి వెంటనే దారి తీశాడు నన్ను తీసుకుని. రెండు మూడు చిన్న సందుల్లాంటి వీధులు మళ్ళి, ఒక చిన్న డాబా ఇంటికి తీసుకు వెళ్ళాడు. లోపలికి వెళ్ళి ఒక ముప్ఫైఅయిదేళ్ళ వ్యక్తిని తీసుకు వచ్చి నన్నతనికి చూపించి, తనకేదో అర్జంటు పని ఉందని చెప్పి సెలవు తీసుకుని తొందరగా వెళ్ళిపోయాడు మీసాలతను.

రాజశేఖరం చాలా సామాన్యంగా ఉన్నాడు. పంచా, లాల్చీ ధరించాడు. పైన ఉత్తరీయం! తెలుగుతనం ఉట్టిపడుతూంది. మనిషి అంత పొడవూ కాదు, పొట్టీ కాదు, సామాన్యమైన ఎత్తే ఉన్నాడు. మంచి ఆరోగ్యమైన శరీరం. ముఖంలో మాత్రం "సిరిసిరిడలు" నవల అట్టమీది ఫోటోలోని వసుంధరాదేవి పోలికలు కొన్ని కనిపించాయి. బహుశా ఇతనామె అన్నగారై ఉంటాడని ఊహించాను. అతని ముఖం ఎందుచేతనో పాలిపోయి ఉంది. విచారరేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నమస్కారం చేసి చిరునవ్వుతో "నా పేరు నరహరి. మీరు. . . . రాజశేఖరంగారనుకుంటాను" అన్నాను.

ప్రతి నమస్కారం చేస్తూ "అవును. సరిగ్గానే ఊహించారు. రండి, కూర్చోండి" అంటూ వీధి అరుగుమీద ఉన్న కుర్చీ చూపించాడు తను ఎదురుగుండా ఉన్న వాలుకుర్చీలో కూర్చుంటూ.

సంభాషణ ఎలా మొదలెట్టాలో తోచలేదు నాకు. కొన్ని క్షణాలు ఆ పరిసరాలు పరికిస్తూ ఉండిపోయాను.

"మీరు నన్ను క్షమించాలి శ్రమ యిస్తున్నందుకు. మీ దగ్గిరికి ఓ పనిమీద వచ్చాను. మేం బందరు దగ్గర్లో ఉంటున్నాం" అని ఆగాను.

"అలాగా" అని చెప్పండి అన్నట్టు చూశాడతను.

"వసుంధరాదేవిగారు మీకేమౌతారు?" సందేహ నివృత్తికోసం అడిగాను.

> **జ్ఞానతృష్ణ**
>
> జి జ్ఞాస ధనేచ్ఛలాగే సంపాదించుకున్న కొలదీ పెరుగుతూపోతుంది.
>
> —స్టెర్న్

"మా చెల్లెలు." ఆశ్చర్యంగా చూసి "ఆ పేరు మీ కెలా తెలుసు?"

"సిరిసిరిడలు నవల ఆమె రాసినదే కదూ?"

"అవునవును. అదొక్కటే కాదు. ఎన్నో రాసింది!"

"నేను చెప్పేది మీరు సావధానంగా వినాలి. నేను ప్రస్తుతం వసుంధరాదేవిగారి కోసం వచ్చాను. ఒక వ్యక్తి ఆమె కోసం పరితపిస్తున్నాడు! ఆమె నవల సిరిసిరిడలు చదివిన దగ్గిరనించీ, ముఖ్యంగా ఆ నవల చివరి అట్టమీద ఉన్న ఆమె ఫోటో చూసిన దగ్గిర నించీ ఆమె ధ్యాస ఎక్కువైంది వాడికి! గంటల తరబడీ, రోజుల తరబడి ఆమె ఫోటో చూసుకుంటూ నిద్రాహారాలుకూడామరిచిపోయిఆమెకోసంతపిస్తున్నాడు. మనిషి పీనుగులా తయారయ్యాడు. ఆఖరికి వాడు తను చనిపోయేలోపల ఒక్కసారి. . ఒక్కసారి ఆమెను చూసి నిశ్చింతగా కళ్ళు మూస్తానంటున్నాడు! నేను చెప్పేది మీకు వింతగా ఉండవచ్చు! కానీ మీరు నమ్మి తీరాలి! వాడి హృదయావేదన మాటలలో వివరించలేను! వా డిక ఎన్నాళ్ళో బ్రతికేలా లేడు. వాడు చచ్చిపోయేలోపల నన్నొక్క ఉపకారం చెయ్యమన్నాడు. వాడు నాకు తమ్ముడికంటే ఎక్కువైనవాడు. దయచేసి త్వరగా ఆమె నొక్కసారి నాకు చూపించండి! నేనామెతో మాట్లాడాలి. వాడి స్నేహితుడుగా, ఆత్మీయుడుగా వాడికి నేనీ ఉపకారం చెయ్యగలిగే అవకాశం కల్పించండి!" దుఃఖంతో నా గొంతు పూడుకు పోయింది.

నేను చెప్పినదంతా అతను విస్మయంతో విన్నాడు. విపరీతమైన మనోవేదనతో కొన్ని క్షణాలు శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు.

"ఇంతవరకూ మీరు చెప్పినది విన్నాను. ఇక నేను చెప్పేది మీరు వినండి" అంటూ చెమ్మగిల్లిన కళ్ళు ఒత్తుకుంటూ చెప్పడం మొదలెట్టాడు.

"వసుంధరలాంటి చెల్లెల్ని పొందగలిగినందుకు నేను గర్వపడేవాణ్ణి. దానికున్న సునిశితబుద్ధి, వివేకం, తెలివితేటలు చాలామందిలో అరుదు. వయస్సులో నా కంటే పదిహేనేళ్ళు చిన్నది. మా అమ్మ దాన్ని మా కందరికి అప్పజెప్పి, దాని మూడో ఏటే వెళ్ళిపోయింది. మా నాన్నగారు కూడా పూర్తిగా దాని బాధ్యత నాకే అంటగట్టి తొమ్మిదేళ్ళ క్రితం ఆయనా వెళ్ళిపోయారు. దానికీ నాకూ వధ్య ముగ్గురు తమ్ముళ్ళు అవతరించి వెళ్ళిపోయారు. మా వంశాని కిక అదీ, నేనే మిగిలాం!

నా చెల్లెలిని గురించి గొప్ప చెప్పుకోకూడదు గాని, తెలివీ, అందమూ, గుణగణాలూ దాని సొత్తు! అది మంచి రచయిత్రి కూడా. మంచిమంచి కథలూ, నవలలూ, వ్యాసాలు ఎన్నో రాసేది. కొన్నింటికి బహుమతులు కూడా వచ్చాయి దానికి. వయస్సులో అంత చిన్నదయినా, అనుభవమన్నది లేకపోయినా ఎంతో భావగర్భితంగా మచ్చుతునకల్లాంటి కథలు ఎలా రాయగలిగేదో, చక్కని పాత్రల్ని ఎలా సృష్టించేదో నా కాశ్చర్యం వేసేది. దాని కవితాశక్తికి మురిసిపోయే వాణ్ణి. దానిది మంచి గాత్రం. అది పాడుతూంటే అతి మధురమైన వీణానాదంలా ఉండేది! ప్రైవేటుగా చదివి మెట్రిక్యులేషన్ పాసయింది. ఒకే వ్యక్తిలో ఇన్ని విశేషాలుండటం చాలా అరుదు.


కానీ కొన్నాళ్ళ కిందటినుంచీ దానికి పరధ్యాన్నం ఎక్కువైంది. దేన్ని గురించో ఆలోచిస్తూ, దేన్నో వెతుకుతున్నట్లుగా శూన్యంలోకి చూస్తూండేది. ఏదో వస్తువుని, ఎవరో ఆత్మీయుల్ని పోగొట్టుకున్నదానిలా కనపడేది. ఎవరి కోసమో పరితపిస్తున్నట్లుండేవి దాని కళ్ళు! తన ఆవేదనంతా రచనల్లో చూపించేదా అన్నట్లుండేవి దాని రచనలు! మొదట్లో నే నీ విషయం అంతగా పట్టించుకోలేదు.

కానీ కొన్నాళ్ళకి దాన్ని మరోకలా అర్థం చేసుకుని దానికి పెళ్ళి చెయ్యాలని సంకల్పించాను. నా భార్యతో కూడా చెప్పించాను పెళ్ళి చేసుకోమని. నేను ప్రయత్నాలు కూడా ప్రారంభించాను. కానీ నేనూహించని విధంగా అది వివాహానికి విముఖత చూపించింది. తనకి వివాహేచ్ఛ లేదంది. నా భార్య దగ్గిరా నా దగ్గిరా ఏడ్చింది తనకి పెళ్ళి వద్దని! చేసేది లేక దానికి పెళ్ళి చేసే ప్రయత్నం మానుకున్నాను.

రోజులు గడుస్తున్నకొద్దీ అది చిక్కిపోవటం ప్రారంభించింది. కలకల్లాడుతూండే దాని ముఖం కళావిహీనం కాజొచ్చింది. సరిగ్గా తిండి తినేది కాదు. నిద్ర పోయేది కాదు. ఏదో ఆలోచిస్తూండేది ఎప్పుడూ." ఆగాడతను.

నా కిదంతా వింటూంటే ఒళ్ళంతా స్తంభిస్తున్నట్లనిపించింది.

ధారాపాతంగా కారుతున్న కన్నీరు తుడుచుకుని మళ్ళీ మొదలెట్టాడతను.



"వదరా బందరు పోదాము"
ఫోటో—సి. ఎస్. రావు (భోపాల్)

"దాని విచిత్ర ప్రవృత్తికి నే నాశ్చర్యపోయాను. రోజురోజుకీ దాని ఆరోగ్యం దిగజారిపోతూంటే నాకు గాభరా అధికం కాసాగింది. దాన్ని ఎన్నో సార్లు మందలించాను ఆరోగ్యం కాపాడుకోమనీ, అనవసరంగా దేని గురించీ ఆలోచించవద్దనీ. దాని మనోవ్యాధికి కారణమేమిటని అనునయంగా అడిగాను ఎన్నోసార్లు. అది నిస్సహాయంగా నవ్వి, తనకే మనోవ్యాధిలేదని విదిలించి పారేసేది.

ఒక రోజు నా కొక ఆలోచన వచ్చింది. అది ఎవరినైనా ప్రేమిస్తుందేమో! ఆ వ్యక్తి మా అంతస్తుకి తగడనీ, అతనితో తన పెళ్ళికి నేను సమ్మతించననీ బాధ పడుతుందేమో! ఈ ఆలోచన రాగానే నే నొక నిశ్చయానికి వచ్చాను. అది ఎవర్ని ప్రేమించినా సరే ఆ వ్యక్తికి దాన్ని ఇచ్చి పెళ్ళి చెయ్యడానికి నిశ్చయించాను. అది నా బహిఃప్రాణం. దాని అన్ననైన నాకు దాని సుఖసంతోషాలకన్న కావలిసిందేమి ఉంది? దాని కిష్టమున్న వారిని ఎవర్ని చేసుకున్నా, అది సుఖపడితే నా కదే చాలు! మా అమ్మా నాన్నల తరవాత దాని బాధ్యత నాదే కదా!

వెంటనే నా భార్యతో చెప్పి అసలు సంగతి కనుక్కోమన్నాను. ఆమె ఎన్ని విధాల, ఎంతలా అడిగి చూసినా ప్రయోజనం లేకపోయింది. "ఫరవాలేదమ్మా, నీ ఇష్టప్రకారమే చెయ్యటానికి మీ అన్నయ్య సిద్ధంగా ఉన్నారు" అని హామీ ఇస్తూ అడిగి చూసింది నా భార్య. అయినా లాభం లేకపోయింది. తన కలాటి ప్రేమలూ, ప్రణయాలూ లేవంది! పైగా, తనను గురించి మే మెవ్వరం అంత బాధ పడక్కర్లేదుట!

త్వరలో దానికి నిద్రాహారాలు లేని కారణంగా నీరసించటంవల్ల గుండెజబ్బు పట్టుకుంది. కథలూ, వ్యాసాలూ రాయటం ఎప్పుడో మానుకుంది. శరీరమంతా శుష్కించిపోయింది. మందులతోబాటు, డాక్టర్లూ ఎందుకూ పనికిరాకుండా పోయారు!" . . . అతనికి దుఃఖం పెల్లుబికింది. కళ్ళు లక్కకాయల్లా అయ్యాయి! కళ్ళు ఉత్తరీయంతో తుడుచుకుని మళ్ళీ మొదలెట్టాడు.

"గత రెండు నెలలుగా పూర్తిగా మంచంమీదే ఉంటూవచ్చింది. ఏ మందులు వాడినా, ఏం చేసినా ప్రయోజనం కనిపించలేదు. మొన్న బుధవారం రాత్రి హఠాత్తుగా దాని గుండెజబ్బు ఎక్కువైంది. ఆ జబ్బులోనే కలవరించటం మొదలెట్టింది.

"వారు. . . ఇక్కడే ఉన్నారు. అయినా నా ఆక్రందన ఆయనకి వినిపించదు!. . . అవును. . నే నిక్కడున్నట్లు ఆయన కేం తెలుసు? పాపం ఆయనకి తెలీదు. . తెలీదు. . .ఎవరు చెబుతారాయనకి?. . . నే నిక్కడున్నాననీ, ఏనాడైనా దైవికంగా నా దగ్గిరికి వస్తా. . . రనీ, వెర్రి ఆశతో . . . నే నెదురు చూసున్నాననీ. . . ఆయనకి చెప్పేదెవరు?. . . అయ్యో!. . . నా మాట లెవరు నమ్ముతారు?. . . అయ్యో. . . ఏమండీ నే నిక్కడే ఉన్నాను. కనపడటం లేదూ?. . . కాని మీరు నా కెన్నోసార్లు కనిపించారు నా కలల్లో!. . . వెంటనే గుర్తుపట్టాను మిమ్మల్ని ఏమండీ. . . ఇక్కడే ఉండి మాట్లాడరేం? అవును మీకు జ్ఞాపకం లేదు. . . నన్ను మరిచిపోయారు అయ్యో!"

అంటూ ఏమేమిటో కలవరిస్తూ తెల్లవారుజామున మూడు గంటలకి కన్ను మూసింది!" అంటూ అతను కుర్చీలో వెనక్కి వాలి, ఉత్తరీయంముఖానికి అడ్డం పెట్టుకొని నిశ్శబ్దంగా రోదించసాగాడు.

నా గుండె బరువెక్కింది. ఇక అక్కడ ఉండాలనిపించలేదు. అసలు సంగతి గ్రహించాను! ఎవరికీ అంతు పట్టని అసాధారణ విషయాన్ని నేను గ్రహించాను! వెంటనే అతని దగ్గిర సెలవు తీసుకుని బయటపడ్డాను.

* * *

వికలమైన మనస్సుతో ప్రయాణపు బడలికతో అలిసిపోయి ఉన్న నేను తిన్నగా రూముకి పోయి తాళం తెరిచాను. సూట్‌కేసు మంచంమీద పడేసి షర్ట్ విప్పుకుంటూండగా ఎదురుగా టేబిలుమీద ఉత్తరం కనిపించింది. అది వెంకట్రామయ్యగారు రాసినదని గ్రహించటానికి ఆట్టే టైముపట్టలేదు. ఉత్తరం చించాను.

"ప్రియమైన నరహరీ,

రాజు ఇక్కడికి వచ్చిన పదిహేను రోజులకు టైఫాయిడ్‌తో మంచం పట్టాడు. వాడి కోరిక నువ్వు తీర్చగలవనే నమ్మకం వాడు చాలా రోజుల కిందటే కోల్పోయాడు. కనీసం నిన్నైనా ఒక్కసారి చూడాలని కలవరించాడు. వాడి మాటలు కొన్ని నా కర్థం కాలేదు. వాడు వాడి భార్యను చాలా ఆలస్యంగా గుర్తుపట్టాడట! 'నా భార్య నన్ను పిలుస్తోంది, వెళ్ళిపోతున్నా'నంటూ మొన్న బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకి నన్ను అన్యాయం చేసి. . .

ఇంక చదవలేకపోయాను ఉత్తరం! నా తల తిరిగి పోయింది! కుర్చీలో కూలబడిపోయాను!

"భగవాన్, ఇదెక్కడి విచిత్రం!" నా ఆశ్చర్యంతో ఏమేమిటి మాట్లాడుకున్నానో నాతో నేనే!

"దేవా, వాళ్ళిద్దర్నీ వచ్చే జన్మలోనైనా ఏకం చెయ్యి తండ్రీ!" అని చేతులు జోడించి, మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి ధ్యానించాను కన్నీరు ధారాపాతంగా కారుతూండగా.

ఆ ఇద్దరిదీ ఒక చిత్రమైన కథ! నా కిదొక విచిత్రమైన అనుభవం! ఇక నా జీవితానికి అనుభవం తాలూకు జ్ఞాపకాలే మిగులు! ★